


ఈ పసికందు పెరిగి పెద్దదై 'నాన్నా' అని తనను పిలిస్తే 'ఏం సమాధానం చెప్పాలి' అని ప్రశ్నించుకున్నాడు వాసు. అతనికి సమాధానాలు అనేకం. అవన్నీ చెప్పి పాప మనస్సు పాడుచెయ్యలేడు తను. అసలవన్నీ సమాధానాలుగూడా కాదు. తన మనసులో మంటల్లా చెలరేగుతున్న అనేకమైన భావాల రూపాలు అవి. అవి నిజమూ కావు. అబద్ధమూ కావు, మళ్లీ పాప కళ్లల్లోకి చూస్తాడు. శాంత కనిపిస్తుంది. 'నాకు తీరని అన్యాయం చేశావు నువ్వు' అని చెబుదామనుకుంటాడు. పాప నవ్వుతుంది. పసిడిబుగ్గల్లో వెన్నెల కాస్తుంది. ఆ కళ్లల్లో అనంతమైన ఆకాశం, అవధుల్లేని సముద్రాలు కలిసిపోయినట్లుంటుంది. అందులో ప్రకృతి ఉదయిస్తుంది. క్షీరసాగరమథనంలో హాలాహలం కదిలినట్లు ఏదో భయం... ఏదో ఛాయ తనను భయపెట్టబోతుంది. వాసు పాపను దగ్గరగా తీసుకుని 'నీకు అన్యాయం చేస్తాననుకున్నావా... భగవంతుడు ఇంకా బ్రతికేవున్నాడు... నీకేం భయం లేదమ్మా...' అంటూ గొణుక్కుంటాడు. పాప మళ్లీ నవ్వుతుంది.

శాంత తనకు అన్యాయం చేసిందేమో అనుకుంటాడు వాసు. అన్యాయం చెయ్యలేననే వెళ్లిపోయాననుకుంటుంది శాంత. ఎక్కడికి వెళ్లిందో ఏమో, ఎవరితో చెప్పిపోలేదు. ఈ విశాలప్రపంచంలో ప్రతి జీవితానికి ఏదో ఒక రకమైన ఆధారం ఉండనే ఉంటుంది. శాంత బ్రతకలేకపోదు. అందుకోసం కాదు వాసు విచారం. శాంత చచ్చిపోయినా అంతగా దుః

ఖించేవాడుగాదేమో! శాంత తనకూ, ప్రపంచానికి అన్యాయం చేసిందని వాసు వాదన. అంతా కలిసి తనకు అన్యాయం చేశారనుకుని వారందరినీ విడిచి వెళ్లిపోయింది శాంత. ఇందులో నిజానిజాలు నిర్ణయం కావటానికి నిజమంటూ ఒక వస్తువు ఏముంటుంది గనక. అది వారి వారి సంస్కారాన్నిబట్టి ఉంటుంది. ఇంతకీ జరిగిన సంగతి ఇది.

వాసు, శాంత ఎవరు అని అడుగుతారు. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. వాళ్ల చరిత్రలు ఏమంత పెద్దవి గావు. సాధారణ కుటుంబాల్లో జన్మించి ఒక ఇంట్లో ఉంటూ వచ్చారు. ఒకరికొకరు ఎంతకాలంగానో తెలుసు. అదీ వారి పరిచయం శాంతకి పెళ్లయిందని, ఒక భర్త కొంతకాలందాకా ఉండేవాడనీ వాసుకి తెలుసు. విగత భర్తృక శాంత. శాంతతో మాట్లాడితే సమాధానం చెబుతుంది ఆమె ఎప్పుడూ నవ్వగాగాని, ఏడ్వగాగాని ఎవ్వరూ చూచి ఎరుగరు. వాసు ఎప్పుడన్నా ఆమె కళ్లల్లోకి చూడగలిగితే నవ్వూ, ఏడుపూ కలిసి ఎన్నో భావాలు తన హృదయానికి వచ్చి తాకుతాయి. తాను ఏదో చెబుదామనుకుంటాడు. శాంత తన గురించి ఏమనుకుంటున్నదో తెలియదు. తన భావాల ప్రతిబింబాలు అక్కడగూడా ఉంటాయి అనుకుంటాడు అతను.

వాసునడిగితే పెళ్లి అయినవాళ్లందరికీ పెళ్లికానివాళ్లందరిమీద ఒకరకమైన ఈర్ష్య అంటాడు. దానికి కొన్ని కారణాలు గూడా ఉన్నాయి అతని దగ్గర. అంతా తనను పెళ్లిచేసుకోమని బలవంతం చేస్తారు. తను సుఖపడుతుంటే చూస్తూ ఊరుకోలేకనే గదా అని అతని అభిప్రాయం. పెళ్లి విషయం వస్తే అతనిలో ఏమేమిటో ఆవేశాలు వస్తాయి. వైవాహికజీవితంలోని సుఖాలను గురించి కాదు. తన ఆశయాలు పలించే రోజులు వస్తున్నాయనే గగుర్పాటు. భగవంతుడు ప్రసాదించిన ఈ జీవితానికి ఏదో ఉపయోగం ఉండాలి. తను మరణించేలోగా ఏదన్నా మంచి పని ఒక్కటన్నా చెయ్యాలి అనుకుంటాడు. "శాంతని పెళ్లిచేసుకుంటాడు తను..." ఆ మాట తలచుకున్నప్పుడల్లా ఆవేశం వచ్చి ముఖం కందిపోయేది. తను ఒక నిర్ణయానికి వస్తాడు. శాంత తనకు భార్య అవుతుంది. జీవితానికి ఇంకేం అక్కర్లేదు అనుకుంటాడు.

కాలేజీ చదువుకోసం పొరుగూరులో ఉన్నప్పుడు వాసు మనస్సు స్థిమితంగా ఉండేదేగాదు. ఎప్పుడూ శాంత గురించే ఆలోచన. అప్పటికే వచ్చి ఆరునెలలు దాటుతోంది. శాంతను చూడాలన్న కుతూహలం అతన్ని కదల్చివేస్తోంది. ప్రతిసారి ఏవో అడ్డంకులు సెలవు పెట్టి పోవడానికి. ఇక ఉండబట్టలేకపోయాడు. కాలేజీకి సెలవు పెట్టి పరుగులెత్తుకుంటూ వచ్చాడు ఇంటికి.

సొంతవూళ్లో ఎరగని వాళ్లే లేరు. సామానంతా బండిలో ఎక్కించి బండివాడి పక్క ముందుగా కూర్చున్నాడు. బండివాడికి వాసుని చూడటంతోటే శాంత గుర్తుకువచ్చింది. అతను పొరుగూరునుంచి వచ్చినా సరే తన బండీమీదనే వాసు ఇంటికి తీసుకుపోతాడు. అతనికి వతను అది. ఇంట్లో సంగతులు కొంచెం కొంచెం పసికడతాడు.

'శాంతమ్మగారు ఆసుపత్రిలో ఉన్నారు తెలుసా... అండి...' అంటూ ప్రశ్నించాడు బండివాడు. ఆ బండిలోనే శాంతని ఆసుపత్రిలో చేర్పించింది. ఆ మాట వింటూనే వాసు గుండె చెదిరిపోయింది. కారణాలు అతను చెప్పలేదు. సామాను ఇంటికి తీసుకుపొమ్మని బండివాడికి చెప్పి వాసు ఉరుకులెత్తుకుంటూ ఆసుపత్రికి పోయాడు.

శాంతని ఇంట్లో లేకుండా ఆసుపత్రిలో చూడవలసివస్తుందని వాసు అనుకోలేదు. ఆసుపత్రి

గదినుంచి నర్సు బయటకు వస్తూ 'మీరు లోపలకు పోవచ్చు' అని చెప్పి వెళ్లిపోయినప్పుడు ఒక క్షణం గుండె దడదడలాడింది అతనికి.

ఆమె మంచందగ్గర ఎవ్వరూ లేరు. అతనికి కొంచెం భయం వేసింది. చొరవ చేసుకుని మంచందగ్గరకు పోయి నిలబడ్డాడు. శాంత అతన్ని చూడటంతోటే అదిరిపడ్డది. ఆమె ముఖంలో నల్లని నీడలు కదులాడినాయి. లేచి కూర్చోవాలని ఆమె ప్రయత్నిస్తున్నట్లు గమనించిన వాసు "వద్దు... అలాగే పడుకో" అని గది నాలుగు మూలలా కలయచూశాడు.

ఆమె నేత్రాలు ఏమేమిటో ప్రశ్నిస్తున్నాయి. చాలా నీరసంగా ఉంది. మాట్లాడటానికి ప్రయత్నించి తొట్రుపాటు పడటంతో వాసు అందుకుని "ఇప్పుడే వచ్చాను... రైలు దిగి బండీమీద వస్తుంటే బండీవాడు చెప్పాడు" అన్నాడు.

"ఏం చెప్పాడు..." అన్నట్టు ఆదుర్దాగా చూసింది శాంత.

"ఎలా అయిపోయావు శాంతా... నిన్ను ఇంకోరకంగా ఊహించుకుంటూ వచ్చాను... అసలేం జరిగింది... ఏమిటి సుస్తీ.. ?" ఆదుర్దా కనపరిచాడు. శాంత ముఖం రెండో పక్కకు తిప్పుకుని వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది. వాసు చూడలేకపోయాడు.

"అధైర్యపడకు శాంతా... నేను వచ్చానుగా!" అంటూ ఆమె ముఖం స్పృశించబోయాడు. ఆమెలో అంత శక్తి ఎలా వచ్చిందో ఏమో... "నన్ను ముట్టుకోకండి" అంటూ పెద్దపెట్టున అరిచింది. వాసు నిర్ఘాంతపోయాడు. శాంత అతనివైపు ముఖం తిప్పనే లేదు. "ఏమిటి... ఏమిటి..." అంటూ ఆదుర్దాగా ప్రశ్నించాడు.

"నన్నడక్కండి... నన్నడక్కండి..." అంటూ గొణిగింది శాంత. వాసు బరువుగా లేచి నిలబడి అటూ ఇటూ చూశాడు. ఏదో భయంకర వాతావరణంలో ఉన్నట్లు తోచింది.

"మళ్లీ వస్తాను..." అంటూ విసురుగా బయటపడి ఇంటికి వచ్చేశాడు.

ఇంటికి పోయేటప్పటికి వర్ధనమ్మ వాకిట్లో ఎదురుచూస్తూ నిలబడింది. తను సందు చివర కనబడటంతో మెట్లు దిగి ఎదురువచ్చి "ఏం బాబూ ఇంత చిక్కిపోయావు" అంటూ కుశలప్రశ్న వేసింది. వాసు నవ్వుతూ "హోటళ్లలో నీలాగా అన్నం తినిపిస్తారా పిన్నీ... ఆరునెలలు దాటింది తృప్తిగా అన్నం తిని..." అన్నాడు.

"సరే కబుర్లకేంలే... ముందర కాళ్లు కడుక్కునిరా... నీకిష్టం అని పూర్ణంబూరెలుగూడా చేశాను..." అంటూ లోపలకు తీసుకుపోయింది వర్ధనమ్మ.

ఇంట్లోకి అడుగు పెడుతుండగా తండ్రి ఎదురుపడి "పదిహేను రోజుల్లో పరీక్షలు పెట్టుకుని... ఇప్పుడేం ముంచుకుపోయిందని వచ్చావు?" అని అడిగి సమాధానం కోసమయినా ఆగకుండా వీధిలోకి వెళ్లిపోయాడు. వాసు నవ్వుకుని "నాన్నకు నామీద కోపం తగ్గలేదల్లే ఉందే..." అన్నాడు.

"నయం... మీ నాన్న మంచివారు కాబట్టి సరిపోయింది. ఇంకోళ్లయితే ఏమన్నా ఉందా... శాంత సంగతి తెలుసా ఏమయిందో" అన్నది.

"నేనే అడుగుదామనుకుంటున్నాను... ఏమయిందేమిటి?" అడిగాడు ఆదుర్దాపడుతూ. వర్ధనమ్మ పింగాణీ పళ్లెంలో పూర్ణంబూరెలు పెడుతూ "పెద్దవాళ్లం. చెబితే చాదస్తం అన్నావు గాని... శాంతకి సుస్తీ ఏమిటో తెలుసా నాయనా... చెడిపోయినవాళ్లందరికీ వచ్చేదే" అంది మెల్లిగా.

వాసుకి ఆ మాట పెద్ద అఘాతంలా తగిలింది.

"జరిగిందేమిటో చెప్పకుండా... చెడిపోయింది... చెడిపోయింది అనటం ఎందుకు పిన్నీ?" అన్నాడు.

"ఉన్నమాట అంటే తప్పొచ్చిందేమిటిరా...?" అని అడిగింది వర్ధనమ్మ.

"తప్పొప్పులు పట్టటం లేదు... అనవసరంగా నిందించవద్దని అంటున్నాను... నేను శాంతని పెళ్లిచేసుకుంటే..." అంటూ ఇంకేదో చెప్పబోతుండగానే వర్ధనమ్మ స్తబ్ధురాలైంది. ముఖం అంతా ఎర్రగా కందిపోయింది.

"అయితే నువ్వు శాంతని పెళ్లిచేసుకుంటావు... మతి ఉండే మాట్లాడుతున్నావా...?" అని అడిగింది వర్ధనమ్మ కుప్పగా కూలిపోతూ.

"అవును...' అంటూ వాసు ముందరవున్న పళ్లెం వదిలేసి దొడ్లో చెయ్యి కడుక్కుని ఇంట్లోకి వచ్చాడు. వర్ధనమ్మ వెనకాలగానే వచ్చింది.

"నేనొక్కమాట అడగనా పిన్నీ..."

"ఏమిటి...?"

"శాంతకి ఇరవైఏళ్లుగాదూ... ఆమె మిగిలిన జీవితమంతా నిస్సారంగా, నికృష్టంగా గడిచిపోకుండా నేను చేయగలిగితే మంచిదే కదూ పిన్నీ..."

వర్ధనమ్మ నిట్టూర్చింది. ఆమె కళ్లల్లో ఎన్నో దృశ్యాలు మెదిలినాయి. ఆమెకు తన జీవితము గుర్తుకువచ్చింది. ఆమె కళ్లలో నీళ్లు కదిలినాయి. ఒకక్షణం ఏమీ మాట్లాడలేకపోయింది.

"ఏమో నాయనా... ఈ ఆవేశాలూ... అనర్థకాలూ నాకేం తెలియవు... మీ నాన్న ఇంకేదో సంబంధం చూస్తున్నారు... పిల్ల బాగా వుంటుందట..."

'శాంత మటుకు బాగాలేదా పిన్నీ... ఆమె జీవితం ఏం కావాలి... అంటే మీరెవరూ మాట్లాడరేం?" అంటూ గంయిమన్నాడు. వర్ధనమ్మ సంబాళించుకోలేకపోయింది. ఆమెకు వెంటనే సమాధానం దొరకలేదు. శాంత రెండు సంవత్సరాల కాపురం ఆమెకు గుర్తు వచ్చింది. పాతివ్రత్యధర్మం భ్రష్టలైపోతున్నది. ఆమెకు భయం వేసింది. శాంత జీవితం ఏం కావాలి? వాసు అడిగిన ప్రశ్న సబబుగానే తోచింది. కనకయ్య సంబంధం తీసికట్టేం గాదు. చిన్ననాటినుంచి ఎరుగున్నవాళ్లు. ఆ అమ్మాయి వాసుమీద ఎన్నో ఆశలు పెట్టుకొని జీవిస్తోంది. ఆ అమ్మాయి జీవితం ఏం కావాలి? వాసుకి ఆ మాట తట్టగూడదూ? అనుకున్నది. రెండేళ్లు కాపురం చేసిన శాంతని చెడిపోయిందంటే అదిరిపడ్డ వాసుకి శీలం అంటే ఏమి తెలుసు? తనెలా చెబుతుంది? వర్ధనమ్మ ముభావంగా ఊరుకుంది. ఆమె దగ్గర సమాధానం లేదు అనుకున్నాడు వాసు.

ఆ రోజు సాయంత్రం కనకయ్య కూతురు సంబంధం మాట్లాడిపోవటానికి వచ్చాడు. వాసు ఎవరితోటీ మాట్లాడకుండా ముభావంగా ఉండిపోయాడు. వర్ధనమ్మ గూడా ఏ విషయం చెప్పలేదు. కనకయ్య చిన్నబుచ్చుకున్నాడు. "నేను మాట్లాడి ఏ విషయం చెబుతానులే..." అన్నాడు వాసు తండ్రి రమణయ్య. కనకయ్య వచ్చినదారినే నిరాశతో వెళ్లిపోతూ మొట్టమొదటినుంచి అనుకుంటున్న మాట... మన కుటుంబాలు నాలుగుకాలాలపాటు కలిసి ఉండేటట్లు చూడటం మన బాధ్యత... అందుకే నాయీ తాపత్రయం...' అని చెప్పేసి ఉత్తరీయం భుజంమీద సర్దుకుని చేతికర్ర ఆడించుకుంటూ వెళ్లిపోయాడు.

కనకయ్య గడప దాటాడో లేదో రమణయ్య విరుచుకుపడ్డాడు వాసుమీద.

"ఎవరిని చేసుకుంటావురా జానకిని గాకుండా... ఈ సంబంధం అనుమానంలో

వచ్చప్పటినుంచి జానకి దిగులుపడి మంచం ఎక్కింది తెలుసా... మీ పిన్ని అంతా చెప్పిందిలే... నీ పిచ్చి, వెర్రిమొర్రి వ్యవహారాలు సాగవు తెలిసిందా...?" వాసు ఏమీ మాట్లాడకపోయేటప్పటికి "ఏంరా... ఎవరికీ చెప్పేది... గోడలకు అనుకున్నావా...? మాట్లాడితే ముత్యాలేమన్నా రాలిపోతాయనుకుంటున్నావా...?" అంటూ గర్జించాడు రమణయ్య.

వాసు గొంతు పెగల్చుకుని "నన్నేమన్నా మాట్లాడనిస్తేనా..." అంటూ గొణిగాడు.

"మాట్లాడమనే గదరా చెప్పేది... నీ క్షోభ ఏమిటో చెప్పరాదూ..." గొంతులో స్వరం ఏ మాత్రం తగ్గలేదు.

"నాకీ పెళ్లి ఇష్టం లేదు..."

"అది తెలుస్తూనే ఉంది... ఎందుకో అఘోరించరాదూ..."

"నేను శాంతని పెళ్లిచేసుకుందామనుకుంటున్నాను..."

రమణయ్యకు వళ్లు మండిపోయింది.

"వెధవముండను పెళ్లిచేసుకుంటావుటరా... సిగ్గులేదూ ఆ మాట అనటానికి... థూ" అని తుపుక్కున ఉమ్మేశాడు.

"నాన్నా..." అంటూ గట్టిగా అరిచాడు వాసు. "నేను శాంతని తప్ప ఎవరినీ పెళ్లి చేసుకోదలచుకోలేదు... ఆమెను మీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడకండి..." అన్నాడు.

రమణయ్య నిర్ఘాంతపోయాడు.

"ఏమిటి కూసింది..." అంటూ మీదకు లేచాడు.

"ఏమీ లేదు... లే"

"అదేదో తేలాలి..."

"అంత నిక్కచ్చిగా తేలాలని ఉంటే నా మాట పూర్తిగా వినండి... శాంతకి జరిగిన అన్యాయం చాలు... మీరు నన్నేం చేసినా సరే... శాంతనే చేసుకుంటాను... ఆ మాట చెప్పిపోదామనే వచ్చాను..." అంటూ ఆవేశపడుతూ చెప్పాడు. రమణయ్య ముఖం కందిపోయింది. వాసు ముఖం జేవురించింది.

"పొండి... అంతా గంగలోకి దిగండి... శాంతని ఎట్లా చేసుకుంటావో చూస్తానుగా..." గళం ఎత్తి అరిచాడు రమణయ్య.

"శాంతనే పెళ్లిచేసుకుంటావుటరా..." మళ్లీ నొక్కి అన్నాడు రమణయ్య.

వాసు కళ్లు ఎర్రగా మండిపోతున్నాయి.

"ఆ... ఆమెనే చేసుకుంటాను..."

"ఆమె ఆసుపత్రిలో ఎందుకు ఉందో తెలుసా?"

"..............."

"తెలీదు... నీకు.... చెపుతా విను... చెడుగా తిరిగి భయపడి ... మందు పుచ్చుకుని... చావలేక ఆసుపత్రిలో చేరింది... కులట.... మహాపతివ్రత అని బాగుచేద్దామనుకుంటున్నావురా... సిగ్గులేదురా నీకు..." అని చేతిలో ఉన్న తుండుగుడ్డ దులిపి భుజంమీద వేసుకుని దొడ్లోకి చరచరా పాములాగా బుసలు కొడుతూ వెళ్లిపోయాడు. వాసు హతాశుడై అలాగే కొయ్యలాగా నిలబడిపోయాడు.

ఆ పూట అన్నం హితవు దోచలేదు వాసుకి. శాంత చెడిపోయిందా? అతని మనసు

కలవరం పొందింది. చల్లబోసుకోకుండా లేచేటప్పటికి వర్ధనమ్మ చెబితేగాని తెలియలేదు. అయోమయంగా ఒకక్షణం నిలబడి వెళ్లిపోయాడు. వర్ధనమ్మ వంట పనంతా చేసుకుని వాసుదగ్గరికి చేరింది. "నాన్న మాటలన్నాడని అభిమానం వచ్చింది కదూ!" అంది. వాసు మాట్లాడలేదు.

అందుకనే కామాలు శాంత తనకు ముఖం చూపించలేకపోయింది. తను బయటకు వచ్చేస్తుంటే మాట అన్నా చెప్పలేదు. తన స్పర్శను విదిలించి పారేసి బిగ్గరగా అరిచిందెందుకు? తనను మోసం చేసిందా? ఎన్నో ఊహించుకున్నాడు. తను చేయబోయే త్యాగానికి ఇంత విలువకట్టిందా... ఛీ..." అనుకున్నాడు.

మరునాడు ఉదయమే ఆసుపత్రికి పరుగెత్తుకుంటూ వెళ్లాడు. శాంత ఎవరో నర్సుతో కబుర్లుచెబుతోంది. తను రాగానే నర్సు లేచి నిలబడి పక్కకు వెళ్లిపోయింది. శాంత ముఖంలో నవ్వు మాయమయింది. వానమబ్బుల్లాగా విషాదచ్ఛాయలు ఆమె ముఖంమీదకు పరుగులెత్తుకుంటూ వచ్చినాయి. ఆమె నేత్రాలు అశ్రుపూరితాలయినాయి. తనవంక ఒక క్షణం చూసినదల్లా ముఖం పక్కకు తిప్పుకుని దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడవసాగింది.

వాసు అలాగే నిలబడి "అంతా తెలిసింది..." అన్నాడు.

శాంత ముఖం తిప్పకుండానే "నేనూ అదే కోరుతున్నాను. నా బాగుకోరితే నాతో మాట్లాడకండి... ఆ రుణం తీరిపోయింది..." అంటూనే వలవలా ఏడవసాగింది. వాసు హృదయం కొద్దిగా ద్రవించింది. ఆగ్రహంతో వచ్చిన తనకు ఆమె మాటలుసానుభూతితో వినాలనే ఇచ్ఛ కలిగింది.

"ఇంత అన్యాయం చేస్తావనుకోలేదు..." అన్నాడు వాసు అలాగే నిలబడి.

"ఆ... నేను అన్యాయం చేశానా... నేనా... నేను..." ఆమె బిగ్గరగా మాట్లాడసాగింది. వాసు నివ్వెరపోయాడు. ఎవరో నర్సువచ్చి "ఏమన్నా కావాలా...?" అని అడిగి వెళ్లిపోయింది.

"నువ్వు కాదూ అన్యాయం చేసింది... అలా అరుస్తావెందుకు? సంఘాన్నీ, కన్నతండ్రినీ ఎదిరించి, నీకోసమని..." అంటూ ఆవేశపడుతూ ఇంకేదో చెప్పలేక ఆగిపోయాడు.

శాంత ఒక క్షణం మెల్లిగా "నామాట వింటారా...?" అని అడిగింది.

"అందుకేగా వచ్చింది..."

శాంత పక్కనే స్టూలుమీద ఉన్న గాజుగ్లాసులో పళ్లరసం తాగుతూ "కూర్చోండి..." అంది. వాసు బిర్రున కుర్చీపీట లాక్కుని కూర్చున్నాడు. శాంత గ్లాసు మంచం కింద పెట్టి మెల్లిగా చెప్పటం మొదలుపెట్టింది.

"నిజంగా నాకిప్పుడే జ్ఞానోదయం అవుతున్నట్లుంది... ఏమిటో అర్థం కాని ఆనందం కలుగుతోంది... అది ఆనందమో విషాదమో తెలియటం లేదు... హాలాహలానికీ, అమృతానికీ తేడా ఏమిటి అనిపిస్తోంది ఇప్పుడు... రెండూ పాలసముద్రంలో నుంచి వచ్చినవే గదూ... ఒకదానికొకటి మారురూపం అనుకుంటాను..."

"ఆ సొదంతా ఎందుకు...? కావలసింది చెప్పకుండా..."

"చెపుతాను... నేను హాలాహలం మింగాను, అమృతం తాగాను... అందుకే మనసులో ఉన్నది చెప్పగలుగుతున్నాను... మీరు సంఘాన్ని ఎదిరించామన్నారే... తండ్రిని ఎదిరించామన్నారే... ఎందుకు...? మీ పేరుకోసం... ప్రఖ్యాతుల కోసం... విధవా వివాహం

చేసుకుని సంఘాన్ని ఉద్ధరించానని ఊళ్లో దండలు వేయించుకుందామని గాదూ..." వాసు తెల్లబోయి చూస్తున్నాడు.

"నన్నట్లాగే అర్థం చేసుకున్నావన్నమాట" పళ్లు పటపటలాడించాడు. శాంత అతి నిర్లక్ష్యంగా చూసి... "అదివరకు అలా అర్థం చేసుకోలేదు... ఇప్పుడు తెలుసుకోగలిగాను... పళ్లు కొరుకుతారెందుకు? ఒకొక్కళ్లు ఒక అభిప్రాయాన్ని సృష్టించుకుని దానికి బానిసలవుతారు... కొందరికి డబ్బు... కొందరికి అందం... కొందరికి పేరు కావాలి... వీళ్లల్లో ఉన్న ఒకొక్క బలహీనతను ఆదర్శంగా కూర్చుకుని, రంగులు వేసి మాట్లాడుతారు... మీరు మటుకు... పేరు కోసం కాకపోతే..." శాంత గద్గదమై, కన్నీరు కార్చటం మొదలుపెట్టింది. వాసుకి భయం వేసింది. ఆశ్చర్యం వేసింది. ఆమె మనసులోకి ఇటువంటి ఆలోచనలు ఎలా చేరాయో అతనికి అంతుపట్టలేదు. వర్ధనమ్మ మనసులో మెదిలింది. కనకయ్య గుర్తుకు వచ్చాడు. తండ్రి గుర్తుకువచ్చాడు. అంతా తన కళ్లముందర నడిచిపోతున్నారు. వాళ్ళల్లో ఒక్కరికీ శాంత సంగతి పూర్తిగా తెలియదు. ఆమె ఆసుపత్రిలో చేరటం వరకే తెలుసు. ఈ అనర్థానికి మూలం ఎక్కడుందో తనొక్కడికే తెలుసు. శాంతకి తెలుసు... సంఘం అంటే ఎవరు? తనూ, శాంత కాదు. ఇంకా నాన్న, పిన్ని, కనకయ్యలాంటివాళ్లు అనేకులున్నారు. తప్పుచేసిన వ్యక్తి నిర్భయంగా తప్పు అంగీకరించి క్షమాపణ కోరుకోగల మానసికస్థైర్యం ఆ వ్యక్తికి కలగనీయరు. ఆ తప్పుతో దారితెన్ను తెలియక తన్నుకులాడిపోతూ నికృష్టమైన జీవితం గడుపుతుంటే 'ఛూ' అని ఉమ్మేసేవాళ్లూ, 'పాపం' అని జాలిపడేవాళ్లు. తనొక్కడూ ఏం చెయ్యగలడు? ఏమీ చెయ్యలేడా?

తనే చెయ్యలేకపోతే ఒకొక్క వ్యక్తిగా సంఘంలోని ఇతరులు మటుకు ఏం చేయగలుగుతారు..? 'నేనేం చెయ్యాలి...?' అంటూ వాసు తల పట్టుకున్నాడు. అతని శిరస్సు వేడెక్కిపోయింది.

"నీకన్యాయం చెయ్యను... నీ కన్యాయం చెయ్యలేను..." అంటూ గొణిగాడు. "నిన్ను ప్రేమించాను... నన్ను నమ్ము..." అంటూ ప్రాధేయపడుతూ అడిగాడు.

"మిమ్మల్ని మళ్లా నమ్మనా... చేసిన తప్పునే మళ్లా చెయ్యమంటున్నారా...?" శాంత మాటలు ములుకుల్లాగా వచ్చినాయి.

వాసు ఆమెవంక తీక్షణంగా చూచాడు. శాంత దీనంగా చూచింది. వాసు కంట తడిపెట్టాడు. శాంత గద్గదస్వరంతో "నా సంగతి అంతా తెలిసిందా...?" అంటూ గొణిగింది.

వాసు మనస్సు పరిపరివిధాల పోయింది. శాంతకి పాప కలుగుతుంది. అతని హృదయం ఝల్లుమంది. ఎన్నో జ్ఞాపకాలు, మధురమనుకున్న క్షణాలు, మనసులో గిరగిర తిరిగినాయి. తను నిర్లక్ష్యం చేయబోతున్నాడని నమ్మిందా శాంత. 'నిజంగా వివాహం చేసుకోవటానికే నిర్ణయించుకున్నాననీ, అందుకే ఇప్పుడు వచ్చాననీ' ఎలా చెప్పటం అన్నది అతనికి తెమలనే లేదు. శాంతని నమ్మవచ్చా? అన్న సంశయం అతన్ని మరీ బాధిస్తూ వచ్చింది. ఆమెలో పెరుగుతున్న ఛాయ ఎవరిది? నీడను బట్టి మనుష్యులనెలా పోల్చుకోవటం –

వాసు ఆలోచనలు ఒకదారి నడవటంలేదు. విధవరాలైన శాంతని వివాహం చేసుకోదలచిన తను, ఏ పాపం ఎరుగని ఆ పసికందును క్షమించలేడూ? శాంతనే స్వీకరించగలిగిన తను ఆ పాపను స్వీకరించలేడూ? ఏమిటి? ఏం చెయ్యాలి? ఆవేశంలో కలిగిన పరిణామాలకు యావజ్జీవం కృంగి కృశించాలా? తన జీవితం కోసం, శాంత జీవితాన్ని తను నాశనం చెయ్యలేడు. కాదు. శాంత కులట. కుళ్లి చావవలసిందే! అవును... కాదు... వాసు ఉన్నట్టుండి హఠాత్తుగా

గది విడిచి బయటకు వచ్చేశాడు. ఎందరెందరో వారి వారి పనులమీద తిరుగుతున్నారు. తన బాధ ఒక్కరికీ అర్థం కాదు. శాంతా, పాప చనిపోతే, ఆ ఉసురెవరికి తగులుతుంది. 'భగవాన్ నాకు జ్ఞానం ప్రసాదించు...' అనుకున్నాడు.

ఎక్కడున్నా వాసుకి కంటిరెప్పలలో శాంత మెదులుతోంది. అన్నం సహించటం లేదు. కునుకుపట్టటం లేదు. తలనొప్పి విపరీతంగా బాధపెడుతోంది. రోజులు చకచకా దొర్లుకుపోతున్నాయి. కనకయ్య చాలా తరుచుగా వస్తున్నాడు. వంట్లో బాగాలేదని పరీక్షలకు వెళ్లటం మానుకున్నాడు వాసు. రమణయ్య తీరిక ఉన్నపుడల్లా లోకాన్ని గురించి అందులో ఉన్నవాళ్ల బాధ్యతలను గురించి కనకయ్య కూతురు సంబంధంతో కలిపి నూరిపోస్తున్నాడు. వాసు అన్నీ విని ఊరుకుంటాడు. తను ప్రత్యేకించి మళ్లా చెప్పదలచింది ఏమీ లేదు. తను ఇంటికి వచ్చిన తర్వాత రెండు కాలెండరు కాగితాలు చింపేశాడు.

ఒకరోజురాత్రి తొమ్మిదిగంటలకు ఏమీ తోచక ఆవేదనలో వాసు షికారుకు బయలుదేరాడు. శాంత సంగతి తెలుస్తూనే ఉంది. బయట వెన్నెల విరగకాస్తున్నది. ఎక్కడో కుక్క తీరికగా కూర్చొని ఏడుస్తోంది. అనుకోకుండానే కనకయ్య ఇంటిసందువైపుకు వెళ్లాడు. అక్కడ జానకి కనపడింది. వాకిట్లో గుమ్మం దగ్గర నిలబడి చందమామవంక చూస్తూ ఏదో పాట పాడుకుంటున్నది. తనను చూసింది. గుర్తుపట్టినట్లుగా నవ్వింది. పాట ఆపలేదు. ఆమె కంటిలో మెరమెర వెన్నెలలో కనబడుతోంది తెల్లటి వాయలు చీరె గాలికి రెపరెపలాడుతోంది. భుజంమీదుగా జారిన కొంగు గాలిలో కొట్టుకుపోతూ నురగలు కక్కే నదీప్రవాహంలా ఉంది. వాసు ఒకక్షణం నిలబడి ఆమె దగ్గరగా వెళ్లాడు. పాట ఆపేసి అతని కళ్లలోకి ఎంతో తృష్ణగా చూసింది. అతను నిగ్రహించుకోలేకపోయాడు.

"నామీద మీకంత కోపం ఎందుకు...?" అంది జానకి. వాసు "లేదు... నీ మీద కోపం లేదు..." అని అక్కడినుంచి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ ఇంటికి వచ్చేశాడు.

రమణయ్య, కనకయ్యలు మళ్లా పెళ్లిసంగతి కదిలించారు. ఈసారి వాసు ఏమాటకీ ఎదురుచెప్పే స్థితిలో లేదు. "మౌనం అర్ధాంగీకారం..." అన్నారు. ఆ మాటకి సమాధానం చెప్పలేదు వాసు చివాలున లేచి వీధిలోకి వెళ్లిపోయాడు.

వర్ధనమ్మ ఒక విషయం గమనించింది. వాసుకి ఇష్టంలేని పెళ్లిచేస్తే జీవితపర్యంతం బాధపడతాడని. ఈ మాటే రమణయ్యతో చెప్పింది. నవ్వి ఊరుకున్నాడు. మళ్లీ మళ్లీ చెప్పి చూచింది. రమణయ్య ఆ మాటను చెవికి పట్టించుకోవటానికి ఇష్టపడటం లేదు.

ఇద్దరమ్మాయిలూ, ఒక అబ్బాయి... తరతరాలుగ వస్తున్న కథావస్తువులు. ఇద్దరిలో ఎవరో ఒకరిని ఎన్నుకుంటాడు కథానాయకుడు. ఆమె అతన్ని ప్రేమించదు. రెండవ ఆమె అతన్ని ద్వేషిస్తుంది. అదీ కథ. లేకపోతే ఇంకొక రకంగా జరుగుతుంది. వాసుకవన్నీ తెలుసు. వాస్తవిక జీవితంలో తను ఏ విధంగా నడచుకోవాలి అంటే అతనికేమాత్రం అవగాహన కావటం లేదు.

మళ్లా ఒకసారి శాంతని చూడాలని కలిగింది. కాని ఆమెలో ఉన్న పసికందు ఆమె కళ్లలోనుంచి చూస్తూ ఉంటుంది. ఆ తరకు చూపులు తను చూడలేదు. చూసి నిలదొక్కుకోలేడు. అందుకనే అతనికి భయం. అందుకనే అతనికి భయం. ధైర్యం కూడగట్టుకుని ఆరోజు ఆసుపత్రిదాకా వెళ్లాడు. ఓ ఎల క్యావు క్యావుమని పసిపిల్ల ఏడవటం వినిపించింది. ఎవరూ

ఆ పాప... ఆ ఆసుపత్రిలో ఇంకెందరో ఉన్నారు. ఎవరని? శాంతకి పాప కలిగితే... వాసు ఉద్వేగం పొందాడు. కన్నీరు కారనంటుంది. కళ్లు మండిపోతున్నాయి. హతాశుడై తిరిగి వచ్చేశాడు.

వర్ధనమ్మ ఇంట్లోకి వస్తున్న వాసుని చూసి కళ్లు వత్తుకుంది. అతన్ని చూస్తే ఆమెకెంతో జాలి వేస్తోంది. ప్రేమ అంటే ఏమిటో ఎవరు నిర్ధారించి చెప్పగలరు. దానికి ఎవరు నిర్వచనం ఇవ్వగలరు? చచ్చేటంతవరకూదానిని అర్ధం చేసుకోలేకుండా ఉండిపోయే వాళ్లెంతమంది? ఇదంతా వర్ధనమ్మ ఏం చెబుతుంది? అతనికేం కావాలో తనెలా అర్ధం చేసుకుంటుంది?

"ఏం బాబు... అట్లా అయిపోతున్నావేం..?" అంది ఎంతో అనునయంగా... వాసు మెల్లిగా దగ్గరకు చేరాడు.

"ఏం బాబు...! నీ బాధేమిటో నాకు చెప్పరాదురా... నా దగ్గర రహస్యాలేమి నాయనా" అంది. ఆమెను చూస్తే గుండెలు తరుక్కుపోతుంటాయి వాసుకి... ఏమని చెబుతాడు. ఏమని అర్ధం చేసుకోగలదు?

"పిన్నీ..." అంటూ ఆమె వడిలోకి వరిగిపోయాడు. అతని నుదురు వెచ్చగా తగిలింది.

"జ్వరం వచ్చినట్లుంది... ఎప్పటినుంచిరా ఇది... అన్నం సహించలేదంటే ఏమిటో అనుకున్నాను..." అంటూ ఆదుర్దా అంతా వెళ్లబుచ్చింది. అలమారలో ఉన్న థర్మామీటరు తెచ్చి టెంపరేచరు చూసింది. మీటరు నూరుపైన జ్వరం చూపిస్తోంది.

"అయ్యో... అయ్యో" అంటూ కడుపుమీద చెయ్యివేసి చూసింది. ఆ ఆదుర్దాతో ఒళ్లు పేలిపోతున్నట్లు కనిపించింది. వాసు నవ్వుతూ "నాకేం సుస్తీ లేదమ్మా... జలుబుచేసి వొళ్లు వెచ్చగా ఉంది." అంటూ వేలాడిపోతూ తన గదిలోకి వెళ్లిపోయాడు.

వైద్యుడు వచ్చి మందిచ్చి వెళ్లిపోయాడు. వాసు అదంతా ఎవరూ చూడకుండా తూములో పోశాడు. దాన్ని ఎవరూ గమనించలేదు. వైద్యం చేతగానివాడని డాక్టర్ని తిట్టిపోశారు.

కనకయ్య వచ్చాడు ఆరోజున పరామర్శ చేయటానికి. వెంట జానకి కూడా వచ్చింది.

ఇద్దరూ సూటిగా గదిలోకి వచ్చారు. కనకయ్య ఏదో మాటాడుతున్నాడు. జానకి అలాగే చూస్తూ నిలబడింది.

"కూర్చో జానకీ..." ఆమె వంక చూస్తూ అన్నాడు. జానకి ఎక్కడలేని సిగ్గునభినయిస్తూ కూర్చుంది.

"ఏం నాయనా... వంట్లో బాగా లేనప్పుడు నిన్నా మొన్నా రాత్రిపూట తిరుగుతున్నావు... అసలే పాడు రోజులు... జాగ్రత్తగా ఉండొద్దూ..." అన్నాడు కనకయ్య. వాసు అవునన్నట్లు నవ్వి ఊరుకున్నాడు. జానకి అతనివంక చూసి ముసి ముసి నవ్వులు నవ్వింది.

"చూడు వాసు... మళ్లా మాఘమాసం వెళ్లిందంటే లగ్నాలు మనకు కుదిరినవి దగ్గరలో లేవుట...ఈ శుద్ధంలోనే లగ్నం పెట్టి ఆ పనికాస్తా అయిందనిపిస్తే... తర్వాత..." అంటూ నసగటం మొదలుపెట్టాడు కనకయ్య. జానకి పెళ్లిమాట వచ్చేటప్పటికి అక్కడెందుకని బయటకు వచ్చేసింది. వాళ్లిద్దరూ చాలాసేపటి వరకూ మాట్లాడుకున్నారు. కనకయ్య ముఖం చిన్నది చేసుకుని బయటకు వచ్చాడు.

వర్ధనమ్మ గుమ్మంలోనుంచే వంటింట్లోకి తీసుకుపోయి "ఏమిటి... ఏమన్నాడేమిటి..?" అంటూ గుచ్చి గుచ్చి అడిగింది.

"కట్నం కావాలిట..."

"ఉహూ..." అంది వర్ధనమ్మ దానిలో తప్పేమున్నదన్నట్లు.

"ఉహూ... అంటావే... కట్నం ఇస్తానని నేనెప్పుడన్నా చెప్పానా... అయితే గియితే నా ఇల్లు వ్రాసిద్దామనుకున్నాను... పదిహేనువేల రూపాయలు ఎక్కడినుంచి తెచ్చి కుమ్మరించేది... ఇవేమన్నా మట్టిబెడ్డలా..." అన్నాడు చికాకుపడుతూ.

"పదిహేనువేలు అడిగాడా... తమాషాకి అన్నాడేమో..."

"తమాషా లేదు... గిమాషా లేదు... అరగంటనుంచి నచ్చచెబుతుంటే... కనీసం నా మాట చెవికి ఎక్కించుకున్నాడూ..."

"అలా ఎప్పటికి కాదు... నే నడుగుతానుండు" అంది వర్ధనమ్మ గదివైపు అడుగులు వేస్తూ. "నువ్వెందుకు అడగటం. ఆ పదిహేనువేలిస్తే... ఇంతకంటె బ్రహ్మదేవుడు దిగి రమ్మంటే దిగివస్తాడు... మీరు నచ్చజెప్పుకోండి... ఏమయినా చేసుకోండి... నేను పోతున్నాను... రామ్మా జానకీ..." అంటూ జానకి చెయ్యి బుచ్చుకుని, వీధిలోకి తీసుకుపోబొయ్యాడు.

"ఇప్పుడే వస్తా నాన్నా..." అని జానకి వాసు ఉన్న గదిలోకి పోయింది. వాసు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"నువ్వెందుకు వచ్చావిప్పుడు... పొండి... అంతా బయటకు పొండి..." అంటూ బిగ్గరగా అరుస్తూ ఆమె వంక చూశాడు. ఆమె కంటినుండి చల్లని చూపులు వీస్తూ అతని చీకాకును కొంతవరకు సర్దుతున్నాయి. జానకి మెల్లిగా కుర్చీపీట మీదనే కూర్చున్నది. వాసు పడుకుని దుప్పటి కప్పుకుని అటు పక్కకు తిరిగాడు. అతనికి గడియ చప్పుడు వినబడింది. జానకి వెళ్లిపోయిందనుకున్నాడు. అతని ముఖంమీద చల్లని స్పర్శ కలిగింది. కళ్లు విప్పి చూశాడు. గడియవేసి వచ్చి మంచం పట్టెమీద కూర్చుని ఉంది జానకి.

"నేనంటే అంతకోపం ఎందుకు?" మళ్లీ అదే ప్రశ్న. ఆమె కళ్లు నవ్వుతున్నాయి. ఆ ప్రశ్న శూలంలా పొడిచేస్తోంది. సమాధానం ఏమిటి? జానకి "సమాధానం తెలుసు" అన్నట్లు చూస్తోంది.

"మీకు కట్నం కావాలిట గదా! మా నాన్న చెప్పారు. నేను మీకేం అపకారం చేశానని. మీకిష్టం లేకపోతే బలవంతానా మీ ఇంట్లో జొరబడి మీ మనశ్శాంతిని చెడగొడదామని గాదు – నా ఉద్దేశం... నేను ఇలా మాట్లాడటం చాలా ఎబ్బెట్టుగా ఉంది గదూ... సత్యం ఎప్పుడూ కటువుగానే ఉంటుంది. మీరు నమ్మని పనిచెయ్యటానికి ప్రయత్నించకండి. నాకేం లోపమని... చదువుకున్నాను... సంగీతం పాడగలను.. నేను అందవిహీనురాలినీ కాదు... ఇవన్నీ ఎందుకు చెప్పానో తెలుసా? నామూలాన మానాన్న అవమానపడవలసిన అవసరం లేదు గనుక... ఆ మాట నేను నమ్మాను గనక వివాహం చేసుకోవలసినది మనమయినప్పుడు దాని సాధకబాధకాలు మనలను దాటి పెద్దలకు పోవలసిన దురదృష్టం ఎందుకు కలగాలి... నేనంటే ఎందుకు అంత కోపం మీకు? నాకేం లోపమనీ..." ఎంతో మృదువుగా అతని నుదురు తాకుతూ అంది జానకి. అతను ఆమె చేతిని అతని హృదయానికి దగ్గరగా తీసుకుంటూ "నువ్వంటే నాకు కోపం కాదు..." అన్నాడు రుద్ధకంఠంతో.

"మరి మానాన్ననెందుకు అవమానం చేశారు...?"

"నన్ను నమ్ము జానకీ... ఎవర్నీ అవమానం చెయ్యాలనిగాదు... చెయ్యలేదు... నీకేమీ లోపం లేదు. నాకు తెలుసు" అన్నాడు.

"ఆ సంగతి నాకూ తెలుసు... నాకేం లోపం లేదనే గదా మీ అభియోగం. మీ వివాహానికి విధవరాలు, కులట అయితేగాని సరిపోదా..." అంటూ రివ్వున గది గడియ తీసి బయటకు వచ్చేసింది. వాసు లేవలేకపోయాడు. "జానకీ..." అంటూ బిగ్గరగా అరిచాడు.

కనకయ్య జానకి రావటంతోటే "ఏమిటి జానకీ ఆ కబుర్లు" అన్నాడు వ్యంగ్యభావంతో. నవ్వింది సమాధానంగా. వర్ధనమ్మ కణతలు నొక్కుకుంది. కనకయ్య జానకిని తీసుకుని వీధిలోకి వెళ్లిపోయాడు.

రమణయ్యకూ, వర్ధనమ్మకూ ఇంట్లో తీరుబడే ఉండటం లేదు. జానకి కనకయ్యతో వాసు తనను కట్నం లేకుండా ఈ మాఘమాసంలోనే పెళ్లి చేసుకోవటానికి ఇష్టపడ్డాడు అని చెప్పినమాట ఇంతవరకు తెచ్చింది. పెళ్లి ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. ఎవరూ వాసుని ఈ విషయంలో తిరిగి సంప్రదించలేదు. రమణయ్య, కనకయ్య కలిసి ఒక నిర్ణయానికి వచ్చి పెళ్లి ఏర్పాట్లు ప్రారంభించారు. అతనూ ఈ విషయం తిరిగి ఎత్తలేదు. ఆఖరికి శుభలేఖలు అచ్చుకావటం గూడా వాసుకి తెలియదు.

అసలే కల్లోలంగా ఉన్న నూతిలో పెద్ద రాతిబండ పడితే కలిగే అల్లకల్లోలం ఎవరికీ తెలియనిది గాదు. శాంతకి ఆడపిల్ల అన్న వర్తమానం ఆ క్షణంలోనే తెలిసింది. ఎవరూ ఆశ్చర్యపడలేదు. వర్ధనమ్మ తిట్టిపోసింది. రమణయ్య శాపనార్థాలు పెట్టాడు. వాసు కుళ్లికుళ్లి ఏడ్చాడు.

ఆరోజు సాయంత్రం వాసుకి ఎవరో చీటీ తెచ్చి ఇచ్చి పోయారు. శాంత అతన్ని ఒకసారి చూడాలని అనుకుంటోందట. ఆ చీటి రమణయ్య చేతిలో పడింది. చూడటం కావటంతోనే చించిపారేశాడు. వాసుని పిలిచి చీవాట్లు పెట్టి చీటిలో ఉన్న సంగతి చెప్పాడు. ఆపాటున వాసు మీద చొక్కా అన్నా లేకుండా పక్కనే ఉన్న తుండుగుడ్డ భుజాన వేసుకుని పరుగెత్తుకుంటూ వెళ్లిపోయాడు. రమణయ్య అలాగే చూస్తూ నిలబడిపోయాడు.

శాంత ఇంకా మంచంమీద పడుకొని ఉంది. పక్కన పసిపిల్ల లేదు. వాసు మెదడులో తుఫాను రేగింది. శాంతను సూటిగా చూడలేకపోయాడు. శాంత వాసు రావటం చూసి "రండి..." అంటూ పిలిచింది. వాసు బిక్కుబిక్కుమంటూ పోయి కూర్చున్నాడు. అతనికెందుకనో మనశ్శాంతి లభిస్తున్నట్లు తోచింది. ఇంతకాలంగా ఏ అడ్డంకువలన శాంతని చూసి సంకోచించాడో ఆ అడ్డంకు తొలగిపోయిందనిపించింది.

"ఎలా ఉంది...?" అని పలకరించాడు. శాంత సమాధానంగా నవ్వింది. ఎవరో నర్సు వచ్చి మందుసీసా దగ్గరలో పెట్టి వెళ్లిపోయింది.

"నన్నిప్పుడైనా అర్థం చేసుకోగలిగావా?" అన్నాడు వాసు.

"నాకు సరిగ్గా తెలియటం లేదు... పాపను చూస్తారా...?" అని అడిగింది.

"ఆఁ...!!" వాసు గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. పాప... అతని ఆశ్చర్యం చూసి శాంత చికాకుపడింది.

"నాకు కళ్లు తిరుగుతున్నాయి... మళ్లీ వస్తాను..." అంటూ చకచకా వీధిలోకి వెళ్లిపోయాడు.

"పిన్నీ... పిన్నీ..." అంటూ అరుస్తూ గట్టిగా తలుపు తట్టాడు. వర్ధనమ్మ పరుగెత్తుకుంటూ వచ్చింది.

"నేను పెళ్లిచేసుకుంటాను పిన్నీ" అన్నాడు వెర్రిగా ఆమెవంక చూస్తూ.

"అట్లాగే చేసుకుందువుగానిలే... ముందర అన్నానికి రా... అసలే పొద్దుపోతోంది" అంది వర్ధనమ్మ.

"అది కాదు పిన్నీ.. నాన్నతోగూడా చెప్పాలి... నేను పెళ్లిచేసుకోబోతున్నాను. ఎవరినో తెలుసా... జానకిని పిన్నీ... నాన్నేడీ..." అంటూ ఇల్లంతా కలయతిరిగాడు. రమణయ్య వచ్చాడు తర్వాత. విషయం తెలిసింది. వింతగా చూశాడు. కనకయ్య, జానకి వచ్చారు. రెండురోజుల్లో శుభలేఖలు అచ్చయిపోయినాయి.

వాసు ఒక శుభలేఖ అందుకుని "బాగుంది... దీనికోసమే ఎంతకాలంనుంచో ఎదురుచూస్తున్నాను. నాకాకలి వెయ్యటం లేదు" అనుకుంటూ గదిలోకి వెళ్లిపోయాడు.

వర్ధనమ్మ వంటింటిలో నుంచి అరుస్తూంది "చల్ల పోసుకుని రెండు మెతుకులు తిను బాబూ" అని. వాసు ఎవరిమాట వినిపించుకోలేదు. అన్నం తినకుండానే పడుకున్నాడు ఆ రాత్రి.

తెల్లవారుతుండగానే లేచి స్నానం చేసి మంచి బట్టలు కట్టుకున్నాడు. శుభలేఖ ఒకటి జేబులో పెట్టుకున్నాడు. తన ప్రేమను అపార్థం చేసుకున్న శాంత ఈ శుభలేఖ చూసి ఏమనుకుంటుంది. తానే స్వయంగా వెళ్లి ఆమెను తన పెళ్లికి పిలుస్తాడు. అప్పుడు శాంత నివ్వెరపోతుంది. ప్రేమ విలువ తెలుసుకుంటుంది. కుళ్లి... కుళ్లి... కాదు. తనకానందం కలిగించే సమయంలో తీవ్రమయిన ఆలోచనకు తావీయరాదు అనుకున్నాడు వాసు.

వాసు సూటిగా ఆసుపత్రికే వెళ్ళాడు. అప్పటికే గేట్లు అన్నీ తెరిచారు గాని లోపల అంతా ఊడుస్తున్నారు. ఆవేదనను కప్పిపుచ్చుకుని గేటు బయటనే నిలబడ్డాడు. ఎవరో వస్తున్నారు. పోతున్నారు. ఆసుపత్రిలోకి ఎవరో కొత్త డాక్టరు వచ్చినట్లున్నాడు. అంతా అతని చుట్టూ మూగి మాట్లాడుతున్నారు. వాసు శుభలేఖ పట్టుకుని పురిటిగది దగ్గరకు వెళ్లి 'శాంతా' అని పిలిచాడు.

"ఎవరండీ...?" ఆడగొంతు వినిపించింది లోపలనుంచి.

"నేనే శాంతా..." అన్నాడు వాసు.

"శాంతగారు ఇక్కడ లేరండీ... ఇంకో గదిలోకి మార్చినట్లున్నారు" అన్నది లోపలి కంఠం. వాసు అక్కడినుంచి బయలుదేరి బయటకు వచ్చాడు. అక్కడ నర్సులంతా ఇంకా గుంపుగానే ఉన్నారు. ఆ డాక్టరుతో ఏమిటో మాటాడుతున్నారు. ఇంతలోకి ఒక నర్సు వచ్చి 'ఈయనేనండి...' అంది. డాక్టరు గుంపులోనుంచి బయటకు వచ్చి "మీరేనా వాసు అంటే..." అన్నాడు.

"అవును" వాసు నసిగాడు.

"శాంత తెల్లవారుజామునుంచి కనిపించటం లేదు..." అన్నాడు మాట తొణకకుండా. "ఆ..." అంటూ తెల్లబోయాడు వాసు. కాళ్లకింద భూమి కదిలిపోతున్నట్లనిపించింది. డాక్టరు వాసుని పట్టుకుని మెల్లిగా లోపలకు తీసుకుపోయి ఒక కుర్చీమీద కూర్చోబెట్టాడు. అలమారలోనుంచి ఒక ఉత్తరం, శుభలేఖ తీసి ఇచ్చాడు.

"మంచంమీద ఈ రెండూ దొరికినాయండీ..." అన్నాడు డాక్టరు గంభీరంగా. వణికిపోతూ వాసు ఉత్తరం తీసి చదువుకున్నాడు.

వాసుగారికి,

మొన్న అర్థమయిందా అని అడిగారే... ఇవ్వాళ అర్థమయింది.. మీలో నీతి నశించలేదని, సత్యాన్ని కాలదన్నలేదని అనుకుంటూ ఉండేదాన్ని. దాని నిజస్వరూపం ఈనాడు బయటపడింది ప్రేమించిన కన్యను వివాహం ఆడటంలో సిగ్గుపడవలసిన అవసరం ఏమీ లేదు. మీ శుభలేఖ నిన్న సాయంత్రం అందింది. నాకేం ఆశ్చర్యం కలగలేదు. పైగా నేనూహించిన సత్యం నా కళ్లముందరకు వచ్చేటప్పటికి నాకు ఎంతో తృప్తి కలిగించింది. మీరు నన్ను ప్రేమించలేదు. ఆ సంగతి నాకు తెలుసు. నన్ను పెళ్లిచేసుకోవటం వలన కలిగే ఫలితాన్ని ప్రేమించారు. మిమ్మల్ని జానకి ప్రేమిస్తోంది. ఆమె కోసం మీరు పేరుప్రఖ్యాతుల మీద ఉన్న మమకారాన్ని చంపుకోలేకపోయారు. త్యాగం చెయ్యలేకపోయారు. తరువాత నిజం తెలిసిందనుకున్నారు. నిజాలు ఎప్పటికీ, ఎన్నటికీ, ఎవ్వరికీ తెలియవు. మనం అనుకునేవి అన్నీ మనవరకూ సంబంధించిన అనుభూతులే. జానకి ప్రేమ జయించింది... ఇంతవరకు నన్ను ఎవరూ ప్రేమించలేదు. ముందరీ సంగతి గూడా గట్టిగా తెలియదు. నా పాప ఉన్నదే... ఇక్కడే వదిలి వెళుతున్నాను. నేనిక్కడ బ్రతకలేను. కలుషితమైన వాతావరణం నన్ను తినేస్తుంది. నన్ను నన్నుగా గుర్తించి ప్రేమించగలవాడు దొరికితే అతనితో కలిసి ఉంటాను. నా జీవితం అంతం అయ్యేవరకు నా అన్వేషణ సాగుతూ ఉంటుంది. నాకందులోనే సంతృప్తి. ఏ జన్మలో పాపాలు ఆ జన్మలోనే అనుభవించటం ఉచితం అనుకుంటాను. అందుకనే పాపను మీ చేతుల్లో ఉంచి, నేను లోకం చేతుల్లోకి పోతున్నాను. పాపకి అన్యాయం చెయ్యకండి. నన్ను వెతికించాలని వృధాశ్రమ పడకండి....

శాంత.

ఉత్తరం అంతా చదివి నిర్జీవి అయిపోయాడు. ఆసుపత్రి గోడలన్నీ కలిసిపోయి ఒకేఒక స్థూలమైన వస్తువులా కనపడుతోంది. ఎవరో నర్సు పాపను తొట్టిలో పెట్టి తీసుకువచ్చింది. పాప ఏడుస్తుంది. శాంత ఎక్కడికి వెళ్లిందో తెలియదు. ఎందుకు వెళ్లిందో కూడా అతనికి తెలియదు. ఆమె వ్రాసుకున్న కారణాలు, అతని ఊహకు సమన్వయం లేదు. తనకు అన్యాయం చేసి వెళ్లిపోయింది. అందుకు కారణాలు వక్కటీ స్పష్టంగా తోచలేదు. శాంత కులట అయితే - తనూ అంతే. అందులో వ్యత్యాసం లేదు. శాంత తనను 'దగాకోరు' అని అనుకుని ఉంటుంది. తను ఆమెను గురించి ఏ అభిప్రాయాన్ని స్ఫుటంగా ఏర్పరచుకోలేదు. ఏది ఎలా ఉన్నా పాప నిర్దోషి. ఇంక ఆ పాప తనది. పాపకు అన్యాయం చెయ్యలేడు.

ఆ పసికందు పెరిగి పెద్దదై 'నాన్నా...' అని తనను పిలిస్తే 'ఏం సమాధానం చెప్పాలి' అనుకున్నాడు. 'ఏమున్నది... అవును పాపా నేనే నీ నాన్నని' అని చెప్పాలి. అంటూ గొణుక్కున్నాడు.

ఇంతకీ ఎవరు ఎవరిని పెళ్లిచేసుకున్నారు? అన్నది కాదు ముఖ్యం. ఎవరు ఎవరికి అన్యాయం చేశారూ? అని - అదీ కావలసింది.

(ఆంధ్రపత్రిక - విలంబి సంవత్సరాది సంచిక)